క్లుప్తంగా

నేత్రదానం..

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లాలో వివిధ ప్రాంతాలకు చెందిన దుస్సా శ్రీరాములు, గుగ్గిళ్ల భారతమ్మ, కందగట్ల కోటయ్య, కందిరాజు వెంకటరంగారావు, బీరెడ్డి అనసూర్య, కట్ల వెంకటేశ్వర్లు, పగిళ్ల నారాయణ, కొత్తపల్లి ఎల్లయ్య మృతి చెందగా.. వారి నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. సేకరించిన నేత్రాలను హైదరాబాద్ ఎల్.వీ. ప్రసాద్, వాసన్ ఐబ్యాంక్‌లకు పంపినట్లు ఖమ్మం నేత్రనిధి కార్యదర్శి ఆర్.అనంత పద్మనాభం ఒక ప్రకటనలో తెలిపారు.

చర్చి నిర్మాణానికి రూ.10 వేలు విరాళం



విరాళం అందిస్తున్న భిక్షయ్య

రఘునాథపాలెం: మండలంలోని కోయచలక-రేగులచలక జంట గ్రామాల పరిధిలో నూతనంగా నిర్మాణం చేపట్టబోయే పునీత జోజప్ప చర్చి నిర్మాణానికి శనివారం కేతేపల్లి భిక్షయ్య కుటుంబసభ్యులు రూ.10వేలు విరాళం అందించినట్లు కమిటీ సభ్యుడు నాగేశ్వరరావు తెలిపారు. ఈమేరకు విరాళానికి సంబంధించిన రశీదు అందజేసి అభినందించారు.

నిరుపేద విద్యార్థినికి..

ఖమ్మం మామిళ్లగూడెం: కామేపల్లి మండలం ముచ్చర్ల గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థిని అక్షితకు ఉన్నత చదువుల నిమిత్తం కొరిపల్లి వెంకయ్య, వెంకటమ్మ వేద సన్నిహిత ట్రస్టు ద్వారా ఆర్థిక సాయం అందజేశారు. శనివారం ట్రస్టు చైర్మన్ కొరిపల్లి శ్రీనివాస్ చేతుల మీదుగా రూ.5,000 అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దుప్పెల్లి శ్రీను, అధికార ప్రతినిధికోటేశ్వరావు, ప్రచార కార్యదర్శి వీరస్వామితో పాటు వెంకన్న, మహేష్, అనూష తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌కు నివాళి..

రఘునాథపాలెం: మండలంలోని సూర్యతండా సర్పంచ్ ఆంగోత్ సక్రు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. శనివారం జరిగిన సంతాప సభలో పలువురు పాల్గొని సక్రు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాలోత్ ప్రియాంక, సుడా డైరెక్టర్, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు అజ్మీరా వీరునాయక్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అఫ్జల్, మంత్రి పీఏ చిరుమామిళ్ల రవికిరణ్, కుర్ర భాస్కర్‌రావు, సర్పంచ్‌లు మాధంశెట్టి హరిప్రసాద్, మెంటెం రామారావు, నాయకులు సూర్య, శివాలాల్, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

ఖమ్మంలీగల్: అక్టోబర్ 6నుంచి మూడు రోజుల పాటు ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో తాళ్లూరి సుహాస్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యాన రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నీ జరగనుంది. ఈ టోర్నీ పోస్టర్లను సీటీసీ ప్రిన్సిపాల్ సుభాష్ చంద్రబోస్ శనివారం ఆవిష్కరించారు. టోర్నీ నిర్వాహకులు దిలీప్ చౌదరి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దిరిశాల కృష్ణారావుతో పాటు పొట్ల శ్రీకాంత్, పసుపులేటి శ్రీనివాస్, వెంకట్ గుప్తా, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్ పోస్టర్లు..

ఖమ్మం మామిళ్లగూడెం: వచ్చే నెల 3న పద్మశాలి శంఖారావం చలో హైదరాబాద్‌కు పెద్ద ఎత్తున పద్మశాలీలు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమర్తపు మురళి కోరారు. శనివారం ఖమ్మంలో దీనికి సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస బాబు, జనార్దన్, శ్రీనివాసరావు, కొండల్ రావు, శ్రీను, వీరభద్రం, రచ్చ శ్రీనివాస్, సత్యనారాయణ, సంపత్‌కుమార్, పి.వెంకటేశ్వర్లు, జీవీఆర్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల ధర్నా..



ఖమ్మంరూరల్: తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న ఆశావర్కర్లు

రఘునాథపాలెం/ఖమ్మంరూరల్: ఆశా వర్కర్లకు కనీస రూ.18వేలు వేతనంతో పాటు ఉద్యోగాన్ని పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యాన రఘునాథపాలెం తహసీల్ ఎదుట, ఖమ్మంరూరల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు ఎస్.నవీన్‌రెడ్డి, శ్రామిక మహిళా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పిన్నింటి రమ్య మాట్లాడాక ఆయా మండల తహసీల్దార్లు లూథర్ విల్సన్, పీ.వీ.రామకృష్ణలకు సమస్యలతో కూడిన వినతి పత్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎర్ర మల్లికార్జున్, పవన్, బి.జ్యోతి, మల్లీశ్వరి, సుభద్ర, నాగమణి, పుష్ప, రూపిని, ఉమాదేవి, విజయలక్ష్మి, మమత, హెల్త్ వర్కర్స్ యూనియన్ నాయకులు జె.మంగ, విజయ, రోజా, ఉమ, ప్రమీల, బేబీ, లక్ష్మి, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

కళలు కనుమరుగు కాకుండా..

నాటక రంగానికి జీవంపోస్తున్న 'నెల నెలా.. వెన్నెల'

- కళాకారులను ప్రోత్సహిస్తున్న వేదిక
- దాతలు, ప్రభుత్వ సహకారంతో ప్రతి నెలా కార్యక్రమం
- నేడు నెల నెలా వెన్నెల 6వ వార్షికోత్సవం

సండే స్పెషల్



ఇటీవల ప్రదర్శించిన ఓ నాటికలోని సన్నివేశం

ఖమ్మంగాంధీచౌక్: పెరిగిన సాంకేతిక పరిజ్ఞానంతో కళారంగంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. పూర్వం ఎంతో ఆదరణ కలిగిన ప్రాచీన కళల్లో ఒకటైన నాటక రంగం కాలక్రమేణా మారుతున్న పరిణామాల్లో కనుమరగవుతున్న పరిస్థితులు కనబడుతున్నాయి. ఈ నేపథ్యాన నాటక రంగాన్ని కాపాడాలని ఖమ్మం కళా సంస్థల ప్రతినిధులు నడుం బిగించి 'నెల నెలా.. వెన్నెల' పేరిట నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రం వేదికగా ప్రతి నెలా ఒక ఆదివారం రంగస్థల కార్యక్రమం నిర్వహించే ప్రక్రియ చేపట్టారు. సినిమాలు, సీరియళ్లకు ఆకర్షితులైన ప్రజలు కళారంగాన్ని మరచిపోకుండా ఉండాలని కళాకారులను ప్రోత్సహిస్తూ కళారంగానికి జీవం పోస్తున్నారు. ఆదివారం నెల నెలా వెన్నెల 6వ వార్షికోత్సవం సందర్భంగా సండే స్పెషల్..

ఆశయం గొప్పది..

కళాకారులను ప్రోత్సహిస్తూ.. నాటక రంగం అంతరించిపోకుండా.. ప్రాచీన కళారంగం ప్రజల మధ్య ఉండాలనే లక్ష్యంతో పలువురు ప్రజా నాట్యమండలి కళా ప్రతినిధులు నెలనెలా.. వెన్నెల కార్యక్రమాన్ని 2007 జూన్‌లో ప్రారంభించారు. దాతల సహకారంతో ప్రతి నెలా తెలుగు రాష్ట్రాల్లోని కళాకారులతో ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రం వేదికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించదలుచుకుని ప్రారంభించారు. కాని అందుకు కావాల్సిన కుర్చీలు, టెంట్ హౌస్ సామగ్రి, తాగు నీరు, రంగస్థల నటులకు అన్నపానీయాలు, పారితోషకాలు, ప్రోత్సాహకాలు తదితరాలన్ని నిర్వాహకులకు సమకూర్చుకోవడం భారంగా మారింది. 13 నెలల పాటు నిర్వహించాక దాతలిచ్చే సహకారం సరిపోకపోవడంతో కార్యక్రమాన్ని నిలిపివేశారు. ఈ క్రమంలో 2009లో ఖమ్మం కళా పరిషత్ సంస్థ మేమున్నాం అంటూ నెలనెలా.. వెన్నెల కార్యక్రమాన్ని కొనసాగించేందుకు ముందుకు వచ్చారు. వీరికి దాతల సహకారం కూడా తోడు కావడంతో 34 నెలల పాటు కార్యక్రమాన్ని నిర్వహించింది. కాగా ప్రేక్షకుల ఆదరణ తగ్గడంతో మరోసారి కార్యక్రమాన్ని నిలిపివేశారు.

తెలంగాణ పోరాటయోధున్ని స్మరిస్తూ...

ఖమ్మం కళాకారులను ప్రోత్సహించిన తెలంగాణ పోరాట యోధుడు అన్నాబత్తుల రవీంద్రనాథ్ స్మారకంగా 2015లో అమరజీవి అన్నాబత్తుల రవీంద్రనాథ్ కళా సాంస్కృతిక సంస్థ(ఆర్క్స్)ను ఖమ్మం కళాకారులు నెలకొల్పి నెలనెలా.. వెన్నెల కార్యక్రమాన్ని కొనసాగించాలని నిర్ణయించారు. తెలంగాణ పోరాట చరిత్ర కలిగిన రవీంద్రనాథ్ పేరిట ఏర్పాటు చేసిన సాంస్కృతిక సంస్థకు ప్రత్యేక



వైతరణి నాటిక ప్రదర్శనలో సినీ నటుడు జయప్రకాష్‌రెడ్డి (ఫైల్)

రాష్ట్రంలో సహకారం లభించింది. ఓ వైపు దాతలు, మరో వైపు ప్రభుత్వం భాషా సంస్కృతిక శాఖ ద్వారా ప్రతి ఏటా కార్యక్రమ నిర్వహణకు రూ. 2 లక్షలను అందించేందుకు ముందుకు వచ్చింది. నాటి నుంచి నిర్విఘ్నంగా 55 నెలలు జరిగిన కార్యక్రమం.. కరోనా కారణంగా లాక్‌డౌన్‌లో భాగంగా 2020 ఫిబ్రవరిలో చివరి ప్రదర్శన ఇచ్చి నిలిపివేశారు. కరోనా నుంచి ఉపశమనం కలగటంతో 2022 మార్చి 27 నుంచి తిరిగి ప్రారంభించాలని కళా ప్రతినిధులు నిర్ణయించారు. ఈ కార్యక్రమ నిర్వహణలో ఆర్క్స్ సంస్థతో పాటు ప్రజా నాట్యమండలి, ఖమ్మం కళాపరిషత్‌లు భాగస్వాములుగా ఉంటున్నారు.

ఖమ్మం వేదికపై ప్రముఖ కళాకారులు

ఖమ్మంలో ప్రతి నెలా నిర్వహించే నెలనెలా.. వెన్నెల కార్యక్రమంలో తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రముఖ కళాకారులు పాల్గొన్న చరిత్ర ఉంది. సినీ రచయితలు, కళాకారులు, దర్శకులు తనికెళ్ల భరణి, రాళ్లపల్లి, జయప్రకాష్ రెడ్డి, ఖమ్మంకు చెందిన శ్రీనివాస్‌రెడ్డి, నారాయణమూర్తి, మాదాల రవి, మారుతీరావు, మంచాల రమేష్ వంటి ప్రముఖులు తమ కళను ఖమ్మం వేదికపై ప్రదర్శించి అలరించారు. ఈ ప్రదర్శనల్లో నాటికల ప్రదర్శనలకు రూ. 40వేల నుంచి రూ. 50 వేలను ప్రోత్సాహకాలుగా కళాకారులకు అందిస్తున్నారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు నిర్వహిస్తున్న నెల నెలా వెన్నెల 6వ వార్షికోత్సవం సందర్భంగా కళాబంధు వీవీ అప్పారావు, సీనియర్ రంగస్థల కళాకారులు పుతంబాక కృష్ణప్రసాద్, అన్నం ఫౌండేషన్ సేవా సమితి అధ్యక్షుడు అన్నం శ్రీనివాస్‌రావులను సత్కరించనున్నారు.

నాటక రంగాన్ని నిలబెట్టేందుకు..



నాటక రంగాన్ని నిలబెట్టేందుకు నెల నెలా.. వెన్నెల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. జిల్లాలోని మారుమూల ప్రాంత కళాకారులు మొదలు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న కళాకారులందరికీ ఈ వేదికను అవకాశంగా అందిస్తున్నాం. ప్రభుత్వం, దాతల సహకారంతో ప్రతినెలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించి కళాకారులకు పారితోషకాలు, బహుమతులు, ప్రోత్సాహకాలను అందిస్తున్నాం.

– అన్నాబత్తుల సుబ్రమణ్యకుమార్, ప్రధాన కార్యదర్శి, ఆర్క్స్ సంస్థ

ఆదరణ లేకుండా పోయింది..



ప్రాచీన కళలు కనుమరుగవుతున్న తరుణాన రంగస్థల ప్రదర్శనలకు ఆదరణ లేకుండాపోతుంది. ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలను అద్దంపట్టే విధంగా ప్రదర్శించే రంగస్థల కళా ప్రదర్శనలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. నేటి తరానికి ప్రాచీన కళారంగంపై అవగాహన కల్పించాల్సి ఉంది. కళాకారుల నుంచి కళాభిమానుల నుంచి ఆదరణను పెంపొందిస్తాం.

– డాక్టర్ నాగబత్తిని రవి, అధ్యక్షుడు, ఖమ్మం కళాపరిషత్

కళాకారులకు వేదిక..



కళాకారులు తమ కళా నైపుణ్యాన్ని ప్రదర్శించి జీవితంలో ఎదిగేందుకు నెల నెలా.. వెన్నెల కార్యక్రమం ఓ వేదికగా మారింది. అనేక మంది కళాకారులను ఈ వేదిక కళారంగానికి పరిచయం చేసింది. ఈ వేదికల్లో ప్రదర్శించిన కళాకారులకు ఉన్నత స్థాయిలో అవకాశాలు దక్కుతున్నాయి. వివిధ జాతులు, సంస్కృతుల వారికి అవకాశాలు కల్పిస్తున్నాం.

– వి.సదానందం, కార్యదర్శి ప్రజా నాట్యమండలి, ఖమ్మం

ఓటరు నమోదు పరిశీలన

నేలకొండపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న ఓటరు నమోదు కార్యక్రమాన్ని శనివారం తహసీల్దార్ ఎస్.శ్వేత తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాలను పరిశీలించాక ఆమె మాట్లాడారు. ఆదివారం కూడా కచ్చితంగా పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్‌ఓలు విధులు నిర్వహించాలని సూచించారు. సమయ పాలన పాటించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.

'గిరిజన బంధు' అమలు చేయాలి

కూసుమంచి: సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు గిరిజన బంధు పథకాన్ని అమలు చేయాలని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రంనాయక్ డిమాండ్ చేశారు. శనివారం కూసుమంచిలో నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మం జిల్లాలో ఐటీడీఏతో పాటు గిరిజన యూనివర్శిటీ, కూసుమంచి మండలంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలను నెలకొల్పి విద్యార్థుల ఇబ్బందులు తీర్చాలని కోరారు. హలావత్ బాసూనాయక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పాలేరు నియోజకవర్గ కన్వీనర్ మూడ్ గన్యానాయక్, నేలకొండపల్లి మండల కార్యదర్శి గుగులోత్ వీరూ నాయక్, నాయకులు హలావత్ చాంప్లా నాయక్, మంగిత్య నాయక్, శ్రీనివాస్, రాందాస్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

ఖమ్మం సహకారనగర్: అధికారమే లక్ష్యంగా ప్రతి మైనార్టీ కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని జిల్లా కాంగ్రెస్ ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ ముజాహిద్ హుస్సేన్ కోరారు. శనివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ముస్లిం, మైనార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ కార్యాచరణ, బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాలపై చార్జ్‌షీట్, పోస్టుకార్డు ఉద్యమం ద్వారా ప్రతి గడపకు పార్టీని తీసుకెళ్లాలన్నారు. సమావేశంలో నాయకులు రఫీ, మహ్మద్ అస్గర్, బాషా, మస్తాన్, గూడ్ సాహెబ్, ఇబ్రాహీం, ఇస్మాయిల్, జానిపాషా తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తలెత్తుకునే పరిస్థితి లేదు..

మండల పరిషత్ సమావేశంలో సర్పంచ్ ఆవేదన



అధికారులను ప్రశ్నిస్తున్న సర్పంచ్ పుల్లయ్య

నేలకొండపల్లి: ఏదైనా సమస్యల గురించి అడిగిన సర్పంచ్‌లను అధికారులు వేధిస్తున్నారని అధికార పార్టీకి చెందిన రాజేశ్వరపురం సర్పంచ్ దండా పుల్లయ్య ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో అధికారుల నివేదిక సమీక్ష జరుగుతున్న సమయాన సర్పంచ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. గత నాలుగేళ్లుగా ప్రతీ సమావేశంలో సమస్యలను దృష్టికి తీసుకొస్తున్నా.. రెవెన్యూ, విద్యుత్, మిషన్ భగీరథ వంటి సమస్యలు పరిష్కరించిన దాఖలాలు లేవు. దీంతో ప్రజలు నిలదీస్తుంటే తలెత్తుకునే పరిస్థితి లేదని అన్నారు. అంతేకాక చేసిన వాటిని బిల్లులు రాక తీవ్ర ఇక్కట్లు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం వివిధ సమస్యలపై ప్రజాప్రతినిధులు అధికారులను నిలదీశారు. ఈ సమావేశంలో ఎంపీపీ వజ్జా రమ్య, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మరికంటి ధనలక్ష్మి, తహసీల్దార్ శ్వేత, ఎంపీడీఓ కె.జమలారెడ్డి, మండల పంచాయతీ అధికారి శివ, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అవగాహన సదస్సు

ఖమ్మంరూరల్: మండలంలోని పొన్నేకల్‌లో గల శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ ఏడాది చదువుతున్న విద్యార్థులకు శనివారం ఇన్నోవేషన్, ఇంక్యూబేషన్, ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ అనే అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కేఎల్‌యూ ప్రొఫెసర్ డాక్టర్ కె.రాఘవరావు సాంకేతిక నైపుణ్యం అభివృద్ధి సరికొత్త ఆవిష్కరణ పరిశోధన అంశాలతో కూడిన జీఎస్టీ ప్రాజెక్ట్స్, ఇన్నోవేటివ్ పేటెంట్ హక్కుల పొందుట గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కృష్ణమూర్తి, సీఈఓ శ్రీనివాస్, వివిధ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐటీలో..

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో శనివారం ఉద్యోగ సంసిద్ధతపై అవగాహన సదస్సును నిర్వహించినట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కమ్యూనికేషన్, ఎంప్లాయిబిలిటీ, లెర్నింగ్ స్కిల్స్, డెషిషన్ మేకింగ్, అడాప్టింగ్ న్యూ టెక్నాలజీ, స్మార్ట్ లెర్నింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించామన్నారు. అనంతరం సంధాన కర్తగా వ్యవహరించినరైజ్ షార్ప్ సీఈఓ ఈడవాసును అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరి అండ్ కరస్పాండెంట్ జి. ధాత్రి, ప్రిన్సిపాల్ జి.రాజ్‌కుమార్, వెస్ ప్రిన్సిపాల్ అమిత్ బిందాజ్, అకాడమిక్ డైరెక్టర్స్ గంధం శ్రీనివాసరావు, ఎ.వీ.వీ. శివ ప్రసాద్, జి.ప్రవీణ్ కుమార్, జి.సుభాష్ చందర్, తదితరులు పాల్గొన్నారు

వ్యవసాయ బిల్లుపై ప్రకటన చేయాలి

ఖమ్మంమయూరిసెంటర్: అమిత్‌షాతో బీజేపీ రైతు భరోసా సభను నిర్వహించనున్న నేపథ్యాన నూతన సాగు చట్టాలు రద్దుకు సంబంధించి ప్రకటన చేయాలని అఖిలపక్ష రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సంయుక్త కిసాన్ మోర్చా సమావేశంలో పలు రైతు సంఘాల ప్రతినిధులు మాట్లాడారు. నూతన సాగు చట్టాలని వ్యతిరేకిస్తూ ఈనెల 31న జెడ్పీ సమావేశ మందిరంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు రైతు సంఘాల నేతలు వెల్లడించారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, వివిధ సంఘాల నాయకులు మాదినేని రమేష్, మీరా, ఆవుల వెంకటేశ్వర్లు, మలీదు నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య ఒలంపియాడ్‌లో మాక్ పోలింగ్



పాఠశాలలో మాక్ పోలింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

ఖమ్మం సహకారనగర్: విద్యార్థులకు ఓటు హక్కు, ఎన్నికల ప్రాధాన్యతపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో నగరంలోని మమత ఆస్పత్రి రోడ్‌లో గల శ్రీచైతన్య ఒలంపియాడ్ స్కూల్‌లో మాక్ పోలింగ్ నిర్వహించినట్లు చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు పునాది అని, దేశ, రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించటానికి ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎం చేతన్, ఆర్ఐ ప్రకాష్, ప్రిన్సిపాళ్లు శర్మ, రాజ్‌కుమార్ జోషి, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

మదర్ థెరిస్సా జయంతి

ఖమ్మం సహకారనగర్: మిషనరీస్ ఆఫ్ చారిటీస్ స్థాపించి దీనులకు సేవ చేసిన భారతరత్న అవార్డు గ్రహీత మదర్ థెరిస్సా జయంతి ఉత్సవాలను త్రివేణి పాఠశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తీసుకొచ్చిన పళ్లు, రొట్టెలు తదితల వాటన్నింటిని నగరంలోని వివిధ అనాథ శరణాలయాలు, వృద్ధాశ్రమాలకు పంపిణీ చేసినట్లు పాఠశాల డైరెక్టర్ గొల్లపుడి వీరేంద్రచౌదరి తెలిపారు. విద్యార్థులు సేవా గుణాన్ని కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కృష్ణవేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ పి.రాజేంద్రప్రసాద్, సీఆర్‌ఓ మురళీకృష్ణ, స్వప్న, ముస్తఫా, అశోక్, చార్లెస్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సమ్మేళనం

ఖమ్మం మామిళ్లగూడెం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రజాసంక్షేమ సంఘం 25ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం ఉదయం జెడ్పీ మీటింగ్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు లింగాల రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి అజయ్‌కుమార్, ఎంపీలు నామా, వద్దిరాజులతో పాటు ఎమ్మెల్సీ మధు, జెడ్పీచైర్మన్ కమల్ రాజ్‌లు పాల్గొంటారని తెలిపారు.

అర్హులందరికీ 'గృహలక్ష్మి' ఇవ్వాలి



మాట్లాడుతున్న అశోక్

రఘునాథపాలెం: బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన గృహలక్ష్మి పథకానికి వేల సంఖ్యలో దరఖాస్తులు వచ్చిన నేపథ్యాన పార్టీలకతీతంగా అర్హులందరికీ ఈ పథకాన్ని వర్తింపచేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఖమ్మం డివిజన్ కార్యదర్శి ఆవుల అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఖమ్మంలో నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.అర్హుల లిస్టు అధికార పార్టీ నేతల కనుసన్నలోనే ఎంపిక చేస్తున్నారన్న అనుమానాలు, ఆరోపణలు వస్తున్న నేపథ్యాన అధికారులు కలుగజేసుకొని అర్హులకు కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో డివిజన్ నాయకురాలు ఆవుల మంగతాయి, మండల కార్యదర్శి కేలోతు లక్ష్మణ్, నాయకులు రామనాథం, నాగేశ్వరరావు, సత్యం, పాపారావు, ప్రేమ్ సింగ్, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్ ఉచిత నిర్ధారణ శిబిరానికి విశేష స్పందన



శిబిరానికి వచ్చిన పలువురు

నేలకొండపల్లి: బసవతారకం ఇండో-అమెరికన్ కేన్సర్ ఆస్పత్రి , రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ అండ్ స్థానిక స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధుల ఆధ్వర్యాన రెండు రోజుల పాటు నిర్వహించనున్న కేన్సర్ అవగాహన, ఉచిత నిర్ధారణ శిబిరానికి మొదటి రోజు శనివారం విశేష స్పందన లభించింది. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో నిర్వహించిన శిబిరంలో స్త్రీలకు మమ్మోగ్రఫీ, పాప్ స్మియర్ స్కానింగ్, పురుషులకు అల్ట్రా స్కానింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాలడుగు పూర్ణచందర్ ప్రసాద్, తెల్లగొర్ల లింగస్వామి, ఏటుకూరి రామారావు, నంచర్ల దేవీ ప్రసాద్, ఈగ అనిల్‌కుమార్, ఓరుగంటి నారాయణరావు, సిరికొండ ఉమామహేశ్వరీ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యం

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాదారానికి చెందిన ఓ విద్యార్థిని ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. దీంతో ఆమె కుటుంబ సభ్యులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, గ్రామానికి చెందిన పలువురిపై వారు అనుమానం వ్యక్తం చేయడంతో పోలీసులు విచారిస్తున్నారు.

అమిత్‌షా సభను జయప్రదం చేయండి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కొండపల్లి శ్రీధర్‌రెడ్డి

ఖమ్మం మామిళ్లగూడెం: కేసీఆర్ రైతాంగ వ్యతిరేక విధానాలకు నిరసిస్తూ.. బీజేపీ ఆధ్వర్యాన ఆదివారం నిర్వహిస్తున్న రైతు గోస బీజేపీ భరోసా బహిరంగ సభను జయప్రదం చేయాలని కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం ఎస్ఆర్అండ్ బీజీఎన్ఆర్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించే కేంద్ర మంత్రి అమిత్‌షా బహిరంగ సభ వేదిక ఏర్పాట్లను పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతు బంధు పేరుతో కేంద్రం నుంచి వస్తున్న అన్ని వ్యవసాయ సంబంధ నిధులను దారి మళ్లించాడని, వ్యవసాయ యాంత్రిక పరికరాలకు సబ్సిడీని ఇవ్వకుండా రైతులను నిండా ముంచాడని ఆరోపించారు. ఉచిత ఎరువులు ఇస్తానని ప్రగల్భాలు పలికిన కేసీఆర్ ఆ ఊసేత్తడం లేదన్నారు. ఆయన వెంట బీజేపీ రాష్ట్ర నాయకులు ఎడ్ల అశోక్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి నున్నా రవికుమార్, చావా కిరణ్, నకిరికంటి వీరభద్రం, వీరెల్లి లక్ష్మయ్య, విద్యాసాగర్‌రెడ్డి, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

'కావ్య'లో అత్యాధునిక సేవలు..



సేవలను ప్రారంభిస్తున్న మేయర్, పక్కన ఎమ్మెల్సీ

ఖమ్మం వైద్యవిభాగం: నగరంలోని కావ్య ఆస్పత్రిలో ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్(ఏఐ) ద్వారా ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చారు. డయాబెటాలజీ, ఎండోక్రైనాలజీ, మధుమోహానికి ముందుగానే కనుగొని చికిత్స అందించవచ్చని ఆస్పత్రి సీఈఓ డాక్టర్ యాలముడి కావ్య తెలిపారు. ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మేయర్ నీరజతో కలిసి శనివారం సేవలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి చైర్మన్ యాలముడి రవీందర్, ఉషాకిరణ్‌కుమార్, రాధాకృష్ణ, పారుపల్లి ప్రసూన, రాజారాణి, పిట్టల నాగేశ్వరరావు, పిట్టల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

డీసీఎల్‌కు వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: పెండింగ్‌లో ఉన్న అన్ని క్లెయిమ్‌లను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ప్రగతి శీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం హెచ్74 (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యాన ఖమ్మం కార్మిక శాఖ డీసీఎల్‌కు శనివారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ కొత్త రిజిస్ట్రేషన్లకు, క్లెయిమ్‌ల రిజిస్ట్రేషన్లకు బయోమెట్రిక్ విధానాన్ని ప్రవేశ పెట్టడం వలన కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గోసు పుల్లయ్య, ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షులు కె.శ్రీనివాస్, డి.శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు, పాలేరు డివిజన్ కార్యదర్శి పి.రాందాస్ పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత

మండలాల్లో ఒక్కరోజు కోటి మొక్కల వృక్షార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం అధికారులు, ప్రజాప్రతినిధులు మొక్కలు నాటారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. – సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంలో మొక్కలు నాటుతున్న టీఎన్జీవోస్ కమిటీ బాధ్యులు



రఘునాథపాలెం: మొక్క నాటి నీరు పోస్తున్న డీఆర్‌డీఓ, జెడ్పీటీసీ తదితరులు



ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహం 'బి'లో..



కూసుమంచిలో ఎంపీపీ, అధికారులు



తిరుమలాయపాలెం: కొక్కిరేణిలో మొక్క నాటుతున్న ఎంపీపీ బోడ మంగీలాల్